క్లుప్తంగా

రేపు మండల మీట్

గుర్రంకొండ: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశులు తెలిపారు. ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

గ్యారంపల్లెలో బాలానందం

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ జి.కొత్తపల్లె ప్రాథమిక పాఠశాలలో తిరుపతి ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ ఆధ్వర్యంలో బాలానందం చిన్నపిల్లల కదంబ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలచే కార్యక్రమాలు రికార్డులు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి. చంద్రశేఖర్ పిల్లలు చదువుతోపాటు సహపాఠ్య కార్యక్రమాలలో కూడా పాల్గొనే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, తిరుపతి రేడియో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో సీపీఐ-సీపీఎం పాదయాత్ర

బి.కొత్తకోట: కేంద్రంలో బీజే పీ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, బీజేపీ నుంచి దేశాన్ని రక్షించాలని కోరుతూ ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం బి.కొత్తకోటలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థిక సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారన్నారు. వంట గ్యాస్, నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు అవస్థలు పడతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నిమ్మనపల్లె : మండలంలోని వెంగంవారిపల్లె సచివాలయ పారిశుధ్య కార్మికుడు అమిటి వెంకటప్ప (56) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. సోమవారం వెంగంవారిపల్లె సర్పంచ్ జి.శ్రీవాణి, భర్త నవీన్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డిలతో కలిసి మృతుని దహన సంస్కారాల కోసం రూ.10వేలు ఆర్థిక సహాయం వెంకటప్ప భార్య లక్ష్మీదేవికి అందజేశారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులుశెట్టి, పొట్టు రమణ, దూకుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

గుర్రంకొండ: మండలంలోని ఎల్లుట్ల పంచాయతీలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఎల్లుట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే హాజరవుతున్నట్లు తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం



చౌకదుకాణంలో తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ: మండలకేంద్రంలోని రేషన్ దుకాణాల్లో రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. పట్టణంలోని పలు చౌకదు కాణాల్లో మూడునెలలుగా రేషన్ బియ్యంతో పాటు సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదు. దీంతో గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల కోటాకు సంబంధించి పట్టణం లోని పలు ప్రాంతాల ప్రజలకు ఇంతవరకు రేషన్‌బియ్యం పంపిణీ చేయలేదు. ఈనేపథ్యంలో సోమవారం తహసీల్దార్ ఖాజాబీ ఆదేశాల మేరకు ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వో నాగరాజు పట్టణంలోని 1,2,3,4 రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. 470 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఎండీయూ ఆపరేటర్లకు అప్పగించారు. ఈ రేషన్ బియ్యాన్ని ఇందిరమ్మ కాలనీలోని ప్రజలకు పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

పీలేరు రూరల్ : స్కానింగ్ సెంటర్‌లను నిర్వాహకులు నిబంధనలకు లోబడి నడపాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషా రాణి అన్నారు. సోమవారం పట్టణంలోని మాధవి హాస్పిటల్, ఎస్‌కేఆర్ హాస్పిటల్, శ్రీనివాసగుప్తా హాస్పిటల్, శ్రీలక్ష్మీ హాస్పిటల్, ప్రసాద్ హాస్పిటల్, క్లారిటీ డయగ్నోస్టిక్స్, స్టార్‌లైట్ డయగ్నోస్టిక్స్ స్కాన్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ చేసి ఆడా, మగ చెప్పడం, అబార్షన్ చేయడం లాంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నారాయణ, హెచ్‌ఈ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యత

- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి
- షాదీమహల్ నిర్మాణానికి భూమి పూజ
- కొత్తగా 18 ఆర్‌వో ప్లాంట్ల ప్రారంభం



షాదీమహల్ భూమిపూజ వద్ద మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు : ముస్లిం మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో షాదీమహల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు అనువుగా రెండెకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు రూ. 50 లక్షలతో షాదీమహల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పవిత్రమైన రంజాన్‌మాసంలో షాదీమహల్ నిర్మాణం ప్రారంభించడం శుభపరిణామమన్నారు. అలాగే మైనారిటీ విద్యార్థులకు అనువుగా పీలేరులో ఉర్దూ డీఎడ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఒంటిల్లు, రాయలవారిపల్లె, కోటపల్లె, తలపుల, మేళ్లచెరువు, జాండ్ల, గూడరేవుపల్లె తోపాటు పీలేరు పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన 18 ఆర్‌వో ప్లాంట్లను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా మండలంలో ఇప్పటి వరకు 40 ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడాలేని విధంగా పీలేరు పట్టణంలో 20 వార్డులకు 22 ఆర్‌వో ప్లాంట్లు, అలాగే మండలంలో 18 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలను ఆర్‌వో ప్లాంట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయంత్రం స్థానిక అక్షా మసీదులో ఎంపీ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, మైనారిటీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆగామొహిద్దీన్, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, నాయకులు అతికా షఫీ, షామియానా షఫీ, మస్తాన్, షాకీర్, మునీర్, అల్లావుద్దీన్, అబీద్, మసూద్, హుమయూన్, షాజహాన్, గడిబాషా, రెడ్డిబాషా, తారాజాన్, సహూరా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు గజమాలతో ఘనస్వాగతం



గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి పీలేరుకు విచ్చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు అభిమానులు స్వాగత ఏర్పాట్లు ఘనంగా ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక ఏపీఐఐసీ లేఅవుట్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్‌కుమార్‌రెడ్డి క్రేన్ ద్వారా భారీ గజమాలతో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కరీముల్లా, దాదావల్లి, షబ్బీర్, వరుణ్‌సాయి, మధు, రెడ్డిబాషా పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి



అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ మురళికి వినతిపత్రం అందిస్తున్న గుండామనోహర్

మదనపల్లె : ప్రభుత్వ అనుమతి లేకుండా, ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా పట్టణ సరిహద్దు పంచాయతీల్లో వేస్తున్న అక్రమ లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమ లేఅవుట్లలో నోటీసు బోర్డులు ఏర్పాటుచేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్లు ఆపాలని నోటీసులు ఇవ్వాల్సిందిగా తెలిపారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా సీటీఎం, కొత్తపల్లె పంచాయతీల్లో వ్యవసాయ భూముల్లో కన్వర్షన్ లేకుండా అక్రమ లేఅవుట్లు వేస్తున్నారని, వీటిని చదును చేసేందుకు సమీపంలోని కొండలు, గుట్టలను తవ్వేస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు గుండామనోహర్ ఫిర్యాదు చేశాడు. మదనపల్లె మండలం కట్టుబావి గొల్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్య కార్మికురాలిగా 20 ఏళ్లగా పనిచేస్తున్న తన భార్యను తొలగించి, ఇతరులను నియమించేందుకు ప్రయత్నిస్తున్నారని, విచారించి న్యాయంచేయాల్సిందిగా స్వామి అర్జీ సమర్పించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే, వ్యవసాయభూములకు దారి సౌకర్యం, భూపరిహారం సమస్యలపై అర్జీలిచ్చారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీల అర్జీలు స్వీకరించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



వాల్మీకిపురం: ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు



కలికిరిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీపీ నూర్జహాన్

వాల్మీకిపురం: పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు రవీంద్ర అన్నారు. సోమవారం పట్టణంలోని జెట్టిపాళ్యెంవీధిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదవర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని, రాబోయే ఎన్నికల్లో పేదవర్గాలు జగన్‌కు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాజేష్, నాయకులు మహేష్, సుధాకర, శ్యామ్, హేమంత్, శేఖర్, రెడ్డిప్రసాద్, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలికిరి పట్టణంలోని టి.బి.రోడ్డు ఏరియాలో ఎంపీపీ నూర్జహాన్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే ఇందిరమ్మకాలనిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉప సర్పంచ్ నూర్జహాన్, నాయకులు బావాజీ, ఫయాజ్, కేఎంఆర్ బావాజాన్, ఖాదర్‌వల్లి, విశ్వనాథ్, కె.ఖాదర్‌వల్లి పాల్గొన్నారు.

రమ్యకు మహిళ పరిశోధక అవార్డు



ప్రొఫెసర్ రమ్య, విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల బయాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రమ్య పాండిచ్చేరిలో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఫర్ అవార్డ్ విన్నర్స్ ఇన్ ఇంజినీరింగ్‌సైన్స్, మెడిసిన్ (ఐఎస్ఎస్‌ఓ2023) సమావేశంలో ఉమెన్ రీసెర్చర్ అవార్డు అందుకున్నారు. హర్యానా గురుజంభేశ్వర్ యూనివర్సిటీ మాజీ చైర్మన్ డాక్టర్.మిలింద్‌పార్లే, తెలంగాణ మహిళా యూనివర్సిటీ మాజీ వీసీ విద్యుల్లత రమ్యకు ఉమెన్ రిసెర్చర్ అవార్డును అందజేశారు. బయాలజీలో రమ్య పీహెచ్‌డీతో పాటుగా 25 జర్నల్స్ రాశారు. పలు అంశాలపై రిసెర్చి చేసి పరిశోధనా పత్రాలు సమర్పించారు. తమ కళాశాల అధ్యాపకురాలు ఉమెన్ రిసెర్చర్ అవార్డు అందుకోవడంపై కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి రమ్యను అభినందించారు. పాండిచ్చేరిలో జరిగిన ఐఎస్ఎస్‌ఓ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్

కలికిరి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ సదుపాయం కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. పాలిసెట్‌కు పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు అర్హులని, ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులకు సంబంధించి కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100 ఫీజుతో ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 10న పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. బుధవారం నుంచి కళాశాలలో ఉచిత కోచింగ్ ప్రారంభమవుతుందని, ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. వివరాలకు 9505504200, 9966209000 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

పన్నులు తగ్గించాలని ధర్నా

బి.కొత్తకోట: నగర పంచాయతీ పరిధిలో ఇంటిపన్నుల తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పన్నులు చెల్లించిన ప్రజలకు కొత్తగా రశీదులు ఇవ్వాలని కోరారు. ఆక్రమణలోని నగర పంచాయతీ ఆస్తులను రక్షించి, స్వాధీనం చేసుకోవాలని కోరారు. వీఎల్‌టీ పన్నుల భారంగా తగ్గించాలని కోరారు. మేనేజర్ రమాదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సలీంబాషా, బషీర్‌ఖాన్, సమీవుల్లా, తంబయ్యశెట్టి, బాలకృష్ణ, అప్రఫల్లీ, జవహర్‌బాబు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

కురబలకోట: మండలానికి సంబంధించి మూడవ విడత వైఎస్సార్ ఆసారా సమావేశం చేనేతనగర్ కెఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ బైసాని జ్యోతి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, వెలుగు ఏపీఎం నీరజ సోమవారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మండలంలో 828 డ్వాక్రా గ్రూపులకు 9108 మంది సభ్యులకు రూ. 7.86 కోట్లు ఆసరా నిధుల చెక్కును అందజేస్తారని తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

తంబళ్లపల్లె: మండలంలో ఆధార్ కార్డుదారులు తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. 2016 సంవత్సరం ముందు కార్డు దారులు వేలిముద్రలతో అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఇందుకు తంబళ్లపల్లె, కన్నెమడుగులలో రెండు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

– 24న కేంద్ర ముస్కాన్‌బృందం పర్యటన



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభావతి

మదనపల్లె : జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగం, ఎస్ఎన్‌సీయూ విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జాతీయ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ సంస్థ జిల్లా పర్యవేక్షణాధికారి డాక్టర్ ప్రభావతి తెలిపారు. సోమవారం జిల్లా ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్యులు, ఎస్ఎన్‌సీయూ, చిన్నపిల్లల విభాగంలో పని చేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో చిన్నపిల్లల విభాగం, ఎస్ఎన్‌సీయూ విభాగంలో పిల్లలకు మెరుగైన చికిత్స అందించాలని, అలాగే పరిశుభ్రత, రోగులకు అవసరమకైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ నెల 24న కేంద్రం నుంచి ముస్కాన్ బృందం మదనపల్లె జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేస్తుందన్నారు. ముందస్తుగా సిబ్బంది మార్గదర్శకాలు పాటించాలన్నారు. దీంతోపాటూ చెక్‌లిస్ట్ ప్రకారం రెండు విభాగాల్లో సౌకర్యాలు, పరికరాలు, అందుబాటులో ఉన్నాయోలేవో పరిశీలించాలన్నారు. ఈ విభాగాల్లో అవసరమైన సౌకర్యాలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్ఎంవో దివాకర్, చిన్నపిల్లల వైద్యులు సురేష్, ఎస్ఎన్‌సీయూ ఇన్‌చార్జి డాక్టర్ వెన్నెల, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. బస్సు సౌకర్యం కల్పించడంతో తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి భక్తులు ఆలయానికి వస్తున్నారు.

గౌరమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ

కడప ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు రిటైర్డ్ మేనేజర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, భారతి దంపతుల ఆర్థిక సహకారంతో గౌరమ్మ గుట్టలో వెలసిన గౌరమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి , కొండకిట్టాల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయం ద్వారా చేపట్టే 30 రకాల విత్తనాల సాగుతో రైతుకు అధిక దిగుబడితో పాటు మంచి ఆదాయం సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ అధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని జర్రావారిపల్లిలో రైతు ఆనంద్‌కు చెందిన ఎకరం పొలంలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిలో 30 రకాల విత్తనాలను విత్తారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో తోటి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 రకాల విత్తనాలతో పాటు ఘన జీవామృతం కలిపి విత్తే పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాషా, పెద్దరెడ్డెయ్య, అనురాధ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు



గుంతయంబాడిలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రమణారెడ్డి

రామసముద్రం: మండలంలోని కుదురుచీమనపల్లె పంచాయతీ గుంతయంబాడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులను సోమవారం వైస్ ఎంపీపీ రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారంతో ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు మంజూరయ్యాయన్నారు. ఎస్సీ కాలనీలో 240 మీటర్ల మేర రోడ్డులో ఏర్పాటు వేస్తున్నట్లు చెప్పారు. అలాగే రాగిమాకులపల్లె పంచాయతీ సాన్నిపల్లెలో జిల్లా పరిషత్ కింద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు చెంగారెడ్డి, చంద్రశేఖర్‌రావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మదనపల్లె : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను విరమించుకుని, అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్ర మంత్రివర్గం ప్రకటన చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఈశ్వరయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్రసమితి పిలుపుమేరకు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కేంద్రప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై కత్తిగట్టిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరో వంచనకు పాల్పడిందన్నారు. కేంద్రఉక్కుశాఖ సహాయమంత్రి ఫగన్‌సింగ్ కులస్తే విశాఖలో పరస్పర విరుద్ధ ప్రకటనలతో గందరగోళానికి కారణమయ్యారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయకార్యదర్శి సురేష్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, రెడ్డెప్ప, దేవా, రవి, నాగరాజు, గోపాల్, వాసు, భాగ్యలక్ష్మి, ఇంద్రాణి, మధు, ఉమ, అయూబ్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపుదాం

దేశంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, నిరంకుశ, నియంతృత్వపాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపి, దేశాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఈశ్వరయ్య అన్నారు. సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ





అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది, ములకలచెరువులో..

మదనపల్లె : అవగాహన ఉంటే అగ్నిప్రమాదాల నివారణ చేయవచ్చని అగ్నిమాపక కేంద్ర అధికారి మాబు సుబాన్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక విజయభారతి స్కూల్‌లో అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మాక్‌డ్రిల్ నిర్వహించి, అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఫైర్‌స్టేషన్ 101, 08571-222101, 9963735597 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో విజయభారతి కరస్పాండెంట్ డాక్టర్.ఎన్.సేతు, లీడింగ్ ఫైర్‌మ్యాన్ పురుషోత్తంనాయుడు, డ్రైవర్, ఆపరేటర్ మురళీ మోహన్‌నాయక్, ఫైర్‌మ్యాన్ విజయకుమార్, ఇమ్రాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ : అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానక చిత్తూరు మార్గంలోని భువన విద్యాలయంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు జరిగిన తరువాత తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్యాంప్రకాష్, నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై సమాచారం అందించండి

ములకలచెరువు: అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలని ములకలచెరువు సర్కిల్ ఫైర్ అధికారి క్రిష్ణయ్య ప్రజలను కోరారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానికంగా ఉండే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సన జాగ్రత్తలపై డెమో నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక యంత్రంలోని పరికరాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

వాల్మీకిపురం: అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గ్యాస్ లీకేజీ, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సురక్షితంగా తప్పించుకునే మార్గాలు తెలిపి, ప్రదర్శనలతో చూపించారు. విపత్కర సమయంలో ధైర్యంగా ఉండాలని, సమస్యల నుంచి బయట పడేందుకు ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బాబయ్య, శ్రీనివాసులు, కిరణ్ కుమార్, రాజగోపాల్, కిరణ్‌బాబు, రవి, ఇమ్రాన్, చైతన్య, భాస్కర్, రెడ్డిశేఖర్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను సద్వినియోగం చేసుకోండి

కలకడ : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అందించే ఫ్యామిలీఫిజీషియన్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కదిరాయచెర్వు పంచాయతీ బొంతలవారిపల్లెలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 85 మందికి సాధారణ చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే 8 మంది గర్భిణులకు వైదసేవలు అందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ సుబ్బరత్న, ముజీబ్, ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి

కలికిరి: మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీ లేఅవుట్‌లలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో సమగ్ర విచారణ చేయాలని ఎంపీపీ నూర్జహాన్ సోమవారం రాయచోటి స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు పీఎస్ గిరీషాకు వినతిపత్రం అందజేశారు. అక్రమాలు జరిగి ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు.